సాక్షి ఖమ్మం

బుధవారం, 13, నవంబర్, 2024



ఐటీ హబ్‌పై బకాయిల భారం

ఖమ్మంలోని ఐటీ హబ్‌లో కంపెనీల యాజమాన్యాలు అద్దె చెల్లించకపోవడంతో నానాటికీ బకాయిలు పెరుగుతున్నాయి. 8లో



కొనసాగుతున్న క్రీడాపోటీలు

వైరాలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలికల గురుకులంలో నిర్వహిస్తున్న జోనల్ స్థాయి క్రీడాపోటీలు రెండో రోజుకు చేరాయి. 8లో

గరిష్టం / కనిష్టం

32° / 23°

వాతావరణం

జిల్లాలో బుధవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉదయం, సాయంత్రం దాటాక చలిగాలుల తీవ్రత పెరిగే అవకాశముంది.

న్యూస్‌రీల్

అన్ని వివరాలు నమోదు చేయాల్సిందే..



యూపీహెచ్‌సీలో పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ కళావతిబాయి

ఖమ్మంవైద్యవిభాగం: ఆస్పత్రిలో అందుబాటులో ఉన్న మందులు, రోజువారీ పంపిణీకి సంబంధించి పూర్తి వివరాలను రికార్డుల్లో నమోదు చేయాలని డీఎంహెచ్‌ఓ బి.కళావతిబాయి ఆదేశించారు. ఖమ్మం ముస్తఫానగర్‌లోని యూపీహెచ్‌సీని మంగళవారం ఆమె తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఉద్యోగుల హాజరు రిజిస్టర్, బయోమెట్రిక్ యంత్రంతో పాటు ఫార్మసి, ల్యాబ్ రూమ్‌ను పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్‌లో పూర్తి వివరాలు నమోదు చేయకపోవడంపై ఫార్మసిస్టును ప్రశ్నించారు. మందుల పట్టిక బోర్డులోనూ వివరాలు ఏరోజుకారోజు నమోదు చేయాలని, వైద్య, ఆరోగ్య కార్యక్రమాలన్నీ సక్రమంగా చేపట్టాలని సూచించారు. అలాగే, వ్యాక్సినేషన్, మాతాశిశు సంక్షేమం తదితర అంశాలపై డీఎంహెచ్‌ఓ సూచనలు చేశారు.

విద్యుత్ సేవలకు టోల్ ఫ్రీ నంబర్ 1912



ట్రాన్స్‌ఫార్మర్‌పై ముద్రించిన నంబర్

ఖమ్మంవ్యవసాయం: రైతులకు మెరుగైన సేవలందించాలనే లక్ష్యంతో విద్యుత్ సంబంధిత సమస్యలు తెలుసుకునేందుకు టోల్ ఫ్రీ నంబర్ 1912ను అందుబాటులోకి తీసుకొచ్చామని ఖమ్మం ఎస్‌ఈ ఏ.సురేందర్ తెలిపారు. అందరికీ తెలిసేలా ట్రాన్స్‌ఫార్మర్లపై ఈ నంబర్ ముద్రిస్తున్నామని వెల్లడించారు. అలాగే, పొలంబాట కార్యక్రమంలోనూ రైతులకు అవగాహన కల్పిస్తున్నారని పేర్కొన్నారు. 24గంటల పాటు ఈ నంబర్ అందుబాటులో ఉంటుందని, ఎలాంటి సమస్య తలెత్తినా సంప్రదించవచ్చని తెలిపారు.

ఎస్‌ఈ పోస్టు దక్కేదెవరికో?

ఖమ్మంఅర్బన్: జలవనరుల శాఖలో ఎస్‌ఈ పోస్టు భర్తీపై ఉత్కంఠ నెలకొంది. ఖమ్మం సర్కిల్ ఇంజనీర్‌గా ఇన్‌చార్జ్ బాధ్యతలు నిర్వర్తించిన నర్సింగరావు గతనెల 31న రిటైర్ అయ్యారు. అప్పటి నుంచి పోస్టు ఖాళీగానే ఉండడంతో ఎవరిని నియమిస్తారోనని శాఖ ఇంజనీర్లు, ఉద్యోగులు ఎదురుచూస్తున్నారు. కనీసం ఇన్‌చార్జ్ బాధ్యతలు కూడా ఎవరికీ అప్పగించకపోవడం చర్చనీయాంశంగా మారింది. గత నెలలో నర్సింగరావు సెలవులో వెళ్లినప్పుడు పాలేరు ఈఈ ఎం.వెంకటేశ్వర్లు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించగా ఈసారి పోస్టు ఖాళీ గానే ఉంచడం గమనార్హం. అయితే, ఖమ్మం సర్కిల్ పరిధిలో రూ.వందల కోట్ల విలువైన సీతారామ ప్రాజెక్టు, మున్నేరు రిటైనింగ్ వాల్స్ పనులు జరుగుతుండడంతో పలువురు ఇంజనీర్లు ఎస్‌ఈ పోస్టు కోసం మంత్రుల ద్వారా ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. గత వారం రోజులుగా నియామకంపై ప్రచారం జరుగుతున్నా ఎటూ తేలడం లేదు. దీంతో కొత్త వారికి అవకాశం ఇస్తారా లేక గతంలో ఇన్‌చార్జ్‌గా విధులు నిర్వర్తించిన పాలేరు ఈఈ వెంకటేశ్వర్లుకు అదనపు బాధ్యతలు ఇస్తారా అన్న మీమాంస నెలకొంది.

రేపు పాఠశాలల్లో తల్లిదండ్రుల సమావేశాలు

'ఇంటింటా చదువుల పంట' యాప్‌పై అవగాహన

నేలకొండపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల స్థాయి తల్లిదండ్రులకు ఎప్పటికప్పుడు తెలిసేలా 'ఇంటింటా చదువుల పంట' యాప్‌ను వినియోగించనున్నారు. కరోనా సమయాన ఆన్‌లైన్‌లో పాఠాలు బోధించేందుకు ఈ యాప్‌ను రూపొందించినా ఆ తర్వాత కార్యకలాపాలు నిలిపివేశారు. ప్రస్తుతం మళ్లీ యాప్ ద్వారా అన్ని వివరాలను తల్లిదండ్రులకు తెలియజేయాలని నిర్ణయించారు. ఈనెల 14న జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా ప్రతీ పాఠశాలలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాలు(పీటీఎం) నిర్వహించి యాప్ డౌన్‌లోడ్ చేసుకునేలా అవగాహన కల్పిస్తారు. జిల్లాలోని వసతి గృహాలు, మోడల్ స్కూళ్లు, గురుకులాలు, ఆశ్రమ పాఠశాలలు మినహా మిగతా పాఠశాలల్లో గురువారం పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ నిర్వహించి యాప్ ఆవశ్యకతను వివరించాల్సి ఉంటుందని జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి రవికుమార్ తెలిపారు. పాఠశాలల్లో జరిగే కార్యక్రమాలు, విద్యార్థుల సామర్థ్యాలను యాప్‌లో అప్‌లోడ్ చేయనుండగా తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చని వెల్లడించారు.

ఎన్నాళ్లు.. ఇంకెన్నేళ్లో?!

కేంద్రప్రభుత్వ నిధులతో చేపట్టిన ఖమ్మం – దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి నిర్మాణానికి అవాంతరాలు తప్పడం లేదు. ఈ గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణం వచ్చే ఏడాది మార్చి లోగా పూర్తి చేయాలనేది లక్ష్యం. అయితే, ప్రస్తుతం జరుగుతున్న పనులను పరిశీలిస్తే కష్టమేనని తెలుస్తోంది. పలు ప్రాంతాల్లో పెద్ద, చిన్న బ్రిడ్జిల నిర్మాణం పూర్తి కాకపోగా, కొత్తగా ఎగ్జిట్ల కోసం ఇంకా డిమాండ్లు వస్తూనే ఉన్నాయి. జిల్లాలో 105.23 కిలోమీటర్ల మేర సాగే ఈ హైవేకు 'ఎన్‌హెచ్ 365బీజీ' నంబర్ కేటాయించగా మూడు ప్యాకేజీల్లో పనులు చేపట్టారు.

– సాక్షిప్రతినిధి, ఖమ్మం



కొణిజర్ల మండలం పెద్దగోపతి సమీపాన హైవే పనులు



కొణిజర్ల మండలం బొట్లకుంట వద్ద నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి

సా...గుతున్న ఖమ్మం - దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులు

- 105 కి.మీ.కు పైగా హైవేలో 57 కి.మీ. మాత్రమే పూర్తి
- పలుచోట్ల పూర్తికాని బ్రిడ్జిలు, ఇతర నిర్మాణాలు
- ప్రతిపాదనల్లోనే ఖమ్మం పరిధిలో ఆర్‌ఓబీ, ధంసలాపురం ఎగ్జిట్
- వచ్చే ఏడాది మార్చి నాటికి పనులు పూర్తవడం కష్టమే..

జిల్లాలో దేవరపల్లి హైవేపై ఉన్న బ్రిడ్జిలు, ఇతర నిర్మాణాల పరిస్థితి

నిర్మాణాలు	ప్రతిపాదన	పూర్తి	నిర్మాణంలో ఉన్నవి
పెద్ద బ్రిడ్జిలు	8	2	6
చిన్న బ్రిడ్జిలు	31	25	6
వీయూపీ	20	11	9
ఎల్‌వీయూపీ	8	7	1
ఎస్‌వీయూపీ	49	36	13
పీయూపీ	31	27	4
ఫ్లై ఓవర్లు	7	2	5
మొత్తం	154	110	44

ప్యాకేజీల వారీగా ఇలా...

ప్యాకేజీ	ప్రాంతం	వ్యయం	నిడివి	పూర్తయినది
ప్యాకేజీ–1	తల్లంపాడు నుంచి సోమవరం వరకు	రూ.1,062.74 కోట్లు	33.604 కి.మీ.	19.50 కి.మీ.
ప్యాకేజీ–2	సోమవరం నుంచి చింతగూడెం వరకు	రూ.761.73 కోట్లు	29.51 కి.మీ.	17.62 కి.మీ.
ప్యాకేజీ–3	చింతగూడెం నుంచి రేచర్ల వరకు	రూ.948.64 కోట్లు	26.95 కి.మీ.	20.04 కి.మీ.
మొత్తం		రూ.2,773.11కోట్లు		57.16 కి.మీ.

భూబదలాయింపులో జాప్యం

ఖమ్మం జిల్లాలో రూరల్ మండలం తల్లంపాడులో మొదలై ఏపీలోని దేవరపల్లి వరకు ఈ హైవే నిర్మిస్తున్నారు. జిల్లాలో హైవే పరిధి ఏపీ సరిహద్దు రేచర్ల వద్ద ముగుస్తుంది. అయితే, చాలావరకు భూసేకరణ పూర్తయినా కొన్ని చోట్ల ఎన్‌హెచ్‌ఏఐకి మ్యూటేషన్ కాలేదు. ప్యాకేజీ–1లో ఖమ్మం రూరల్ మండలం తల్లంపాడు నుంచి వైరా మండలం సోమవరం వరకు నిర్మాణం 2022 అక్టోబర్ 31న ప్రారంభించారు. ఈ పనులను 2025 మార్చి 31లోగా పూర్తి చేయాల్సి ఉంది. కానీ 221 హెక్టార్లకు సంబంధించి మ్యూటేషన్ పెండింగ్‌లో ఉంది. ప్యాకేజీ–2లో 172 హెక్టార్లు, ప్యాకేజీ–3లో 155 హెక్టార్లు రికార్డుల్లో ఎన్‌హెచ్ భూమిగా నమోదు చేసినా 'ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియా' పేరుతో బదలాయించాల్సి ఉంది. ఇక ఖమ్మం రూరల్ మండలం తెల్దారుపల్లి సమీపాన ఎకరం మేర భూసేకరణ పెండింగ్‌లో ఉంది.

మరికొన్ని సమస్యలు..

జిల్లాలో మూడు ప్యాకేజీల్లో నిర్మిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ హైవేకు చిక్కుముడులు వీడటం లేదు. ఈ నిర్మాణం పచ్చని పొలాల మీదుగా సాగుతుండడంతో విద్యుత్ హైటెన్షన్ స్తంభాలు అడ్డొస్తున్నాయి. వీటిని తొలగించి ఇతర చోట్ల ఏర్పాటుచేయడానికి అయ్యే ఖర్చులు చెల్లిస్తేనే పనులు చేపడతామని విద్యుత్ శాఖ అధికారులు చెబుతున్నట్లు తెలిసింది. అలాగే ఖమ్మం సమీపంలోని ధంసలాపురం వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి(ఆర్‌ఓబీ) నిర్మించాలి. ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు రైల్వే శాఖకు ప్రతిపాదనలు పంపినా అనుమతి లభించలేదు. ఇప్పటికిప్పుడు రైల్వే శాఖ ఆర్‌ఓబీ నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినా పనులు పూర్తి కావడానికి ఏడాదికి పైగానే పడుతుంది. అంతేకాక పలుచోట్ల వెహికిల్ అండర్ పాస్‌లు(వీయూపీ), లైట్ మోటార్ వెహికల్ అండర్ పాస్‌లు(ఎల్‌వీయూపీ), స్మాల్ వెహికిల్ అండర్ పాస్(ఎస్‌వీయూపీ)ల నిర్మాణం అసంపూర్తిగానే ఉంది.

ఖమ్మం - దేవరపల్లి గ్రీన్ ఫీల్డ్ హైవేపై ధంసలాపురం వద్ద ఎగ్జిట్ ప్రతిపాదిత ప్రాంతం



ఎగ్జిట్ల కోసం డిమాండ్ల వెల్లువ

గ్రీన్‌ఫీల్డ్ హైవేపై ఎగ్జిట్ల కోసం పలు గ్రామాల ప్రజల నుంచి డిమాండ్లు పెరుగుతున్నాయి. ప్రస్తుతం జిల్లాలో ఏడు చోట్ల ఎగ్జిట్లు ప్రతిపాదించారు. ఖమ్మం రూరల్ మండలం పొన్నెకల్లు, కోదాడ క్రాస్, వైరా మండలం సోమవరం, కల్లూరు మండలం లింగాల, పెనుబల్లి మండలం సీతారాంపురం, వేంసూరు మండలం లింగపాలెం వద్ద ఎగ్జిట్లకు అనుమతి లభించింది. తొలి ప్రతిపాదనల్లో లేకపోయినా స్థానికుల డిమాండ్ మేరకు లింగాల, లింగపాలెం వద్ద ఎగ్జిట్లు కేటాయించారు. అయితే ధంసలాపురం వద్ద ఎగ్జిట్ కావాలని ఇప్పుడు స్థానికులు డిమాండ్ చేస్తున్నా ఇంకా అనుమతి లభించలేదు. ఇక్కడ ఎగ్జిట్ కోసం స్థానికులు పలుమార్లు ఆందోళన కూడా చేశారు.

ఒక్కొక్కటిగా పూర్తవుతున్నాయి...

ఖమ్మం – దేవరపల్లి జాతీయ రహదారి పనులు ఒక్కొక్కటిగా పూర్తవుతున్నాయి. ధంసలాపురం ఎగ్జిట్ ప్రతిపాదనలు కూడా పంపించాం. పలుచోట్ల బ్రిడ్జిల నిర్మాణం చివరి దశలో ఉంది. ఖమ్మం రూరల్ మండలంలో ఎకరం మేర భూసేకరణ త్వరలోనే పూర్తవుతుంది. ఎక్కడా సమస్య లేకుండా పనులు జరుగుతున్నాయి.

– దివ్య, పీడీ, జాతీయ రహదారులు

తక్కువ ధరతో కొనే హక్కు లేదు..



పత్తిలో తేమ శాతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

- రైతులకు అన్యాయం చేసే వ్యాపారుల లైసెన్సులు రద్దు చేయండి
- అధికారులు బాధ్యతగా వ్యవహరించకపోతే చర్యలు
- పత్తి కొనుగోళ్లను పరిశీలించిన కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మంవ్యవసాయం: ప్రభుత్వం నిర్ణయించిన మేరకు పత్తిలో 8 – 12 శాతం తేమ ఉన్నా మద్దతు ధర తగ్గించే హక్కు వ్యాపారులకు లేదని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ స్పష్టం చేశారు. ఈక్రమాన రైతుల పక్షాన నిలవాల్సిన అధికారులు నిర్లక్ష్యం చేయడం సరికాదని మందలించారు. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో పత్తి కొనుగోళ్లను మంగళవారం కలెక్టర్ తనిఖీ చేశారు. కలెక్టర్‌ను చూడగానే పలువురు రైతులు ఆయన వద్దకు వచ్చి తేమ పేరిట వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని గోడు వెళ్లబోసుకున్నారు. తేమ పరీక్షలు నిర్వహించకుండానే మద్దతు ధర కన్నా రూ.1,000కి పైగా తక్కువ చెల్లిస్తున్నారని తెలిపారు.

అసలేం జరుగుతోంది..

రైతుల ఆవేదన విన్న కలెక్టర్ అధికారులను పిలిచి వివరాలు తెలుసుకున్నారు. మార్కెట్‌కు 906మంది రైతులు 20,679 బస్తాల పత్తి తీసుకురాగా, గరిష్టంగా రూ.6,850, మోడల్ ధర రూ.6,700, కనిష్ట ధర రూ.5,800గా నమోదైందని వెల్లడించారు. ధర ఖరారైన పత్తిని పరీక్షించగా ఓ రైతు తీసుకొచ్చిన పత్తిలో 9శాతమే తేమ ఉన్నా క్వింటాకు రూ.6,800 ధర చెల్లించినట్లు గుర్తించిన కలెక్టర్ మండిపడ్డారు. నాణ్యమైన పత్తికి ధర తగ్గిస్తున్న వ్యాపారులకు నోటీసులు జారీ చేసి లైసెన్సులు రద్దు చేయాలని అధికారులను ఆదేశించారు. అధికారులు రైతుల పక్షాన నిలవాలే తప్ప వారికి అన్యాయం జరుగుతున్నా ఉపేక్షిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కాగా, 20 నుంచి 25 తేమ ఉంటే ధర విషయంలో తామేం చేయలేమని, 8 నుంచి 15 శాతం వరకు తేమ ఉంటే మద్దతు ధర దక్కేలా చూస్తామని రైతులకు భరోసా కల్పించారు. జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ఎంఏ.అలీం, ఖమ్మం మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

వ్యాపారుల తీరు మారదు..



కలెక్టర్ హెచ్చరించినా వ్యాపారులు వారు నిర్ణయించుకున్న ధరకే కొనుగోలు చేశారు. మూడెకరాల్లో పత్తి సాగు చేయగా 44 బస్తాల పంట తీసుకొచ్చా. పరీక్ష నిర్వహించకుండానే తేమ ఉందని రూ.6,500కు కొనుగోలు చేశారు. ఫలితంగా క్వింటాకు రూ.వెయ్యి మేర నష్టపోయా.

– పంతంగి వెంకన్న, రామకృష్ణాపురం, చింతకాని మండలం

ధర నిర్ణయించాక పేచీలు



45 బస్తాల పత్తి తీసుకొస్తే తొలుత రూ.6,400 ధర నిర్ణయించారు. కాంటా వేసేటప్పుడు పంట నాణ్యతగా లేదని ఇంకొందరు వచ్చి రూ.6,200, రూ.6వేలకే అడిగారు. మార్కెట్‌లో మాయాజాలం అర్థం కాలేదు. పంటను తిరిగి తీసుకెళ్లలేక అమ్ముకోవాల్సి వచ్చింది.

– కొనకంచి కోటయ్య, వందనం, చింతకాని మండలం

హక్కుల పరిరక్షణకు పకడ్బందీ చర్యలు



మాట్లాడుతున్న కమిషన్ చైర్మన్ వెంకటయ్య. పక్కన కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, సీపీ సునీల్‌దత్ తదితరులు

- ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు మెరుగైన విద్య అందించడంపై దృష్టి
- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

ఖమ్మం సహకారనగర్: ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణకు పకడ్బందీ చర్యలు చేపట్టడమేకాక విద్యార్థులకు మెరుగైన విద్యనందించడంపై దృష్టి సారించాలని రాష్ట్ర షెడ్యూల్ కులాల, షెడ్యూల్ తెగల కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఆదేశించారు. కలెక్టరేట్‌లో భూసంబంధిత అంశాలు, అట్రాసిటీ కేసులపై మంగళవారం నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, పోలీస్ కమిషనర్ సునీల్‌దత్, కమిషన్ సభ్యులు రేణికుంట్ల ప్రవీణ్, రాంబాబు నాయక్ పాల్గొన్నారు. తొలుత శాఖల వారీగా ఎస్సీ, ఎస్టీలకు అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, ప్రీ, పోస్టు మెట్రిక్ రెసిడెన్షియల్ హాస్టళ్ల నిర్వహణ, ఇందిరా మహిళా శక్తి, కార్పొరేషన్ రుణాలు, దళిత బంధు, భూసమస్యలు, అట్రాసిటీ కేసుల వివరాలను అధికారులు వివరించారు.

నెలలోగా సమస్యల పరిష్కారం

కమిషన్ చైర్మన్ వెంకటయ్య మాట్లాడుతూ పెండింగ్ భూసమస్యలను నెలలోగా పరిష్కరించాలని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అవసరమైన వసతులు కల్పించాలన్నారు. ఎమ్మెల్యేలను సమన్వయం చేసుకుంటూ అద్దె భవనాల్లో ఉన్న 300 అంగన్‌వాడీలకు సొంత భవనాలు మంజూరు చేయించుకోవాలని, వీటి పనులు మార్చి నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. పాఠశాలల్లో కిచెన్ గార్డెన్ల ఏర్పాటు, ఆంగ్ల పరిజ్ఞానం పెంపునకు వినూత్న కార్యక్రమాలను అమలు చేస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌ను అభినందించారు. ఈ కార్యక్రమాలను రాష్ట్ర వ్యాప్తంగా అమలుకు సిఫారసు చేస్తామని తెలిపారు. కాగా, పోలీస్‌స్టేషన్లకు వచ్చే ప్రజలతో మర్యాదగా ప్రవర్తిస్తూ వారి సమస్యలు తెలుసుకుని మానవీయ కోణంలో పరిష్కరించాలని సూచించారు. ప్రతీనెల చివరి వారంలో సివిల్ రైట్స్ డే అవగాహన పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు.

40 దరఖాస్తులు పెండింగ్

కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ రెవెన్యూ శాఖకు సంబంధించి ఎస్సీ, ఎస్టీలు ఇచ్చిన 40 దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా, నెల వ్యవధిలో పరిష్కరిస్తామని తెలిపారు. సీపీ సునీల్‌దత్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద అందే ఫిర్యాదులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఏటా సుమారు 80 నుంచి 90 కేసులు వస్తున్నాయని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు డాక్టర్ పి.శ్రీజ, పి.శ్రీనివాసరెడ్డి, అదనపు డీసీపీ నరేష్‌కుమార్, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి కె.సత్యనారాయణతోపాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లకు సిద్ధంగా ఉండాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీజ, పక్కన మరో అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, అధికారులు

- రైతులు ఇబ్బంది పడకుండా అన్ని వసతులు
- అదనపు కలెక్టర్లు శ్రీజ, శ్రీనివాసరెడ్డి

ఖమ్మంసహకారనగర్: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఇబ్బంది పడకుండా అన్ని వసతులు కల్పించి కొనుగోళ్లకు సిద్ధం కావాలని అదనపు కలెక్టర్లు డాక్టర్ శ్రీజ, పి.శ్రీనివాసరెడ్డి సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం తహసీల్దార్లు, ఎంపీడీఓలతో సమీక్షించిన వారు మాట్లాడారు. జిల్లాలో 2,88,888.78 ఎకరాల్లో వరి సాగుచేయగా 6,64,444.2 మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందనే అంచనాలో ఉన్నట్లు తెలిపారు. ఇందుకోసం 324 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేయగా ఇప్పటికే 25,672 క్వింటాళ్ల ధాన్యం కేంద్రాలకు చేరిందని తెలిపారు. కొనుగోలు చేసిన 24 గంటల్లోగా ధాన్యాన్ని మిల్లులకు రవాణా చేయాలని, వాతావరణ పరిస్థితుల దృష్ట్యా టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. తేమ, తాలు శాతంతో పాటు రహదారులపై ఆరబోస్తే జరిగే ప్రమాదాలపై రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు.

గ్రూప్– 3 పరీక్షలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

వచ్చేనెల 17, 18వ తేదీల్లో జరగనున్న గ్రూప్–3 పరీక్షలకు జిల్లాలో పటిష్ట ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆమె మరో అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డితో కలిసి పరీక్షల ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా శ్రీజ మాట్లాడుతూ జిల్లాలో 27,984 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరు కానుండగా 87 కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. విజయ ఇంజనీరింగ్ కాలేజీ, ఎస్‌బీఐటీ ప్రిన్సిపాళ్లు రీజినల్ కోఆర్డినేటర్లుగా వ్యవహరిస్తారని తెలిపారు. ప్రతీ 150 మంది అభ్యర్థుల గుర్తింపును తనిఖీ చేసేందుకు ఒక ఉద్యోగిని కేటాయించనున్నట్లు వెల్లడించారు. ఈసమావేశాల్లో డీఆర్వో ఎం.రాజేశ్వరి, జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్‌కుమార్, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ శ్రీలత, ఆర్డీఓ నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో గిరిజన యువకుడి సత్తా

పేటెంట్స్ అండ్ డిజైన్స్ ఎగ్జామినర్‌గా ఎంపికైన కార్తీక్



కుటుంబసభ్యులతో కార్తీక్

రఘునాథపాలెం: మండలంలోని సుకినీ తండాకు చెందిన మాలోత్ కార్తీక్ కేంద్రప్రభుత్వం పరిధిలో గెజిటెడ్ స్థాయి ఉద్యోగం సాధించాడు. జాతీయ స్థాయిలో నిర్వహించిన పోటీ పరీక్షలో ఆయన 515 ర్యాంకు సాధించాడు. దీంతో మినిస్ట్రీ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఆధ్వర్యంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్‌లో పేటెంట్స్ అండ్ డిజైన్స్ ఎగ్జామినర్‌గా ఎంపికయ్యాడు. గతేడాది డిసెంబర్ 23న ప్రిలిమినరీ, ఈ ఏడాది జనవరి 25, ఫిబ్రవరి 5న మెయిన్స్ పేపర్–1, 2 పరీక్షలతో పాటు ఆన్‌లైన్ ఇంటర్వ్యూకు కార్తీక్ హాజరు కాగా, సోమవారం ప్రకటించిన ఫలితాల్లో ఉద్యోగం సాధించినట్లు వెల్లడైంది. సుకినీతండాకు చెందిన మాలోతు బాషా ఎక్సైజ్ ఎస్ఐగా, ఆయన సతీమణి పార్వతి వైరాలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. ప్రస్తుతం ఖమ్మం బల్లేపల్లిలో నివసిస్తుండగా వీరికి మౌనిక, కార్తీక్ సంతానం. వీరిలో కార్తీక్ గౌహతి ఐఐటీలో 2019లో ఇంజనీరింగ్ పూర్తిచేశాక ఇంజనీరింగ్ సర్వీస్ ఎగ్జామినేషన్‌లో జాతీయ స్థాయి 27వ ర్యాంకు సాధించి తమిళనాడులో ఉద్యోగం చేస్తున్నాడు. ఆ ఉద్యోగం చేస్తూనే పేటెంట్స్ అండ్ డిజైన్స్ ఎగ్జామినర్ ఉద్యోగానికి ఎంపికైన ఆయనను పలువురు అభినందించారు. కాగా, ఐఈఎస్ సాధించాలన్నది తన లక్ష్యమని కార్తీక్ వెల్లడించాడు.

74 మందికి సదరమ్ సర్టిఫికెట్

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో మంగళవారం నిర్వహించిన సదరమ్ క్యాంపులో 74 మంది దివ్యాంగులు సర్టిఫికెట్‌కు అర్హత సాధించారు. స్లాట్ బుక్ చేసుకున్న వారిలో 133మంది హాజరయ్యారని వైద్యాధికారులు తెలిపారు. వీరిని పరీక్షించిన వైద్యులు వివిధ విభాగాల్లో 74 మందిని సర్టిఫికెట్ అర్హులుగా గుర్తించారు.

ఐటీ హబ్‌పై బకాయిల భారం

- ప్రారంభం నుండి అద్దె చెల్లించని పలు సాఫ్ట్‌వేర్ కంపెనీలు
- బకాయిలు రూ.1.80 కోట్లకు పైగానే
- మరోపక్క నెలకు రూ.4లక్షల మేర నిర్వహణ వ్యయం



ఖమ్మంలోని ఐటీ హబ్

ఖమ్మంఅర్బన్: జిల్లా నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలను కల్పించాలనే లక్ష్యంతో ఖమ్మంలో మూడేళ్ల క్రితం ఐటీ హబ్ ఫేస్–1 ఏర్పాటుచేశారు. ఇందులో పలు సాఫ్ట్‌వేర్ కంపెనీలు తమ కార్యాలయాలను ఏర్పాటుచేసి యువతకు ఉద్యోగాలు ఇచ్చాయి. అయితే, తెలంగాణ పారిశ్రామిక మౌళిక సదుపాయాల సంస్థ(టీజీఐఐసీ)కు మాత్రం నెలనెలా అద్దె చెల్లించడం లేదు. ఐటీ హబ్ మొదలైనప్పటి నుంచి అద్దె చెల్లించకపోవడంతో ప్రస్తుతం బకాయిలు రూ.1.80కోట్లకు చేరాయి. ఈ అద్దె రాక.. మరోపక్క నెలనెలా నిర్వహణ భారంతో సంస్థ అధికారులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు.

రూ.30కోట్లతో నిర్మాణం

ప్రభుత్వం తెలంగాణ పారిశ్రామిక మౌళిక సదుపాయాల సంస్థ ద్వారా సుమారు రూ.30 కోట్ల వ్యయంతో ఐటీ హబ్‌ను నిర్మించింది. ఇందులో ప్రత్యేక గదులు, ఏసీలు, తాగునీరు, విద్యుత్, నెట్ సౌకర్యమేకాక ఫర్నీచర్ కూడా సమకూర్చింది. ఈ వసతుల కల్పనకు అయ్యే ఖర్చు చెల్లించేలా ఒప్పందంతో ప్రారంభంలో 19 సాఫ్ట్‌వేర్ కంపెనీలు అద్దెకు తీసుకున్నాయి. ఆయా కంపెనీల్లో 432 మందికి ఉద్యోగావకాశాలు కూడా కల్పించారు. అయితే, కంపెనీల బాధ్యులు వినియోగించుకునే స్థలం ఆధారంగా విద్యుత్, ఏసీ, నెట్ సౌకర్యంతో కలిపి ప్రతీ కుర్చీకి రూ.2,200 చొప్పున చెల్లించాల్సి ఉంది. కానీ కంపెనీలు ప్రారంభించి మూడేళ్లు కావొస్తున్నా రూపాయి కూడా చెల్లించలేదు. ఫలితంగా గత జూలై నాటికే సుమారు రూ. 1.80 కోట్ల మేర తెలంగాణ పారిశ్రామిక మౌళిక సదుపాయాల సంస్థకు చెల్లించాల్సి ఉన్నట్లు తెలిసింది.

నిర్వహణ భారంతో ఇక్కట్లు

ఐటీ హబ్ నిర్వహణకు నెలనెలా కనీసం రూ.4 లక్షల మేర వ్యయం చేయాల్సి వస్తోంది. విద్యుత్, నెట్ సౌకర్యం, రక్షణ తదితర అంశాలకు సాఫ్ట్‌వేర్ కంపెనీలు చెల్లించకపోయినా ప్రభుత్వం ద్వారా సమకూరుస్తున్నారు. ఈ విషయమై ఉన్నతాధికారుల నుంచి ఇక్కడి అధికారులపై ఒత్తిడి పెరుగుతోందని తెలిసింది. ఓవైపు నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించారనే భావనతో కంపెనీలపై కఠినమైన చర్యలు తీసుకోలేక.. ఇంకోపక్క అద్దె, నిర్వహణ భారం భారం భరించలేక అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. కాగా, అద్దె బకాయిలు చెల్లించాలని కంపెనీలకు అధికారులు 36కు పైగా నోటీసులు జారీ చేసినా కాలం గడుపుతున్నట్లు తెలిసింది.

నోటీసులు జారీ చేస్తున్నాం..



ఖమ్మం ఐటీ హబ్‌లో సాఫ్ట్‌వేర్ కంపెనీలకు సంబంధించి అద్దె బకాయిలు పేరుకుపోయా. వీటిని చెల్లించాలని పలుమార్లు నోటీసులు జారీ చేశాం. మేమే ఏసీలతో పాటు నెట్ సౌకర్యం తదితర మౌలిక వసతులన్నీ కల్పించాం. అయినా బకాయిలు రావడం లేదు.

– పి.మహేశ్వర్, టీజీఐఐసీ జోనల్ మేనేజర్, ఖమ్మం

క్లుప్తంగా

సిఫారసు లేఖలను ఆమోదించండి



టీటీడీ చైర్మన్‌ను సన్మానిస్తున్న తుమ్మల

ఖమ్మంవన్‌టౌన్: తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) బోర్డు చైర్మన్ బి.రాజగోపాల నాయుడును రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మంగళవారం హైదరాబాద్‌లో సన్మానించారు. తెలంగాణ మంత్రులు, ప్రజాప్రతినిధుల నుండి అందే సిఫారసు లేఖలను ఆమోదించాలని ఈ సందర్భంగా మంత్రి కోరారు.

ఆలిండియా స్విమ్మింగ్ పోటీలకు యలమందరావు



యలమందరావు

మధిర: ఆలిండియా స్విమ్మింగ్ పోటీలకు మధిరకు చెందిన కొందూరు యలమందరావు ఎంపికయ్యారు. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా ఈడుపుగల్లులో ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆధ్వర్యాన సివిల్ సర్వీసెస్ విభాగంలో ఈనెల 9న నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబరిచిన ఆయనను ఢిల్లీలో జరగనున్న ఆలిండియా పోటీలకు ఎంపిక చేశారు. ప్రస్తుతం ఎన్టీఆర్ జిల్లా వీరులపాడు మండలం కొణతమాత్మకూరు జెడ్పీహెచ్‌ఎస్‌లో ఫిజిక్స్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న యలమందరావును మధిర స్విమ్మర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జంగా నరసింహారెడ్డి తదితరులు అభినందించారు.

ఉషా టోర్నీలో జిల్లా క్రీడాకారుల ప్రతిభ



క్రీడాకారులను అభినందిస్తున్న డీవైఎస్‌ఓ సునీల్‌కుమార్‌రెడ్డి

ఖమ్మం స్పోర్ట్స్: రంగారెడ్డి జిల్లాలో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ ఉషా టోర్నీలో ఖమ్మం క్రీడాకారులు సత్తా చాటారు. బాలబాలికల విభాగాల్లో జిల్లా క్రీడాకారులు టి.సాయిభవ్యశ్రీ, డి.నరేన్, జె.ప్రహర్షన్‌పాల్, వై.రిత్విక్, జి.చక్రధర్‌ఆర్యన్, వై.సుశాంత్, డి.హర్షిణి, కె.యజ్ఞసేన, ఎం.డీ. అబ్బాస్‌గోరి, కె.ప్రణవ్ పతకాలు సాధించారు. ఈ సందర్భంగా వారిని డీవైఎస్‌ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి, కోచ్ పి.పరిపూర్ణాచారి మంగళవారం అభినందించారు.

షుగర్ కేన్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ చైర్మన్‌గా నరేంద్ర



కస్తాల నరేంద్ర

కల్లూరు: కల్లూరు షుగర్ ఫ్యాక్టరీ కేన్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ చైర్మన్‌గా మండలంలోని తెలగవరానికి చెందిన కస్తాల నరేంద్ర నియమితులయ్యారు. ఈ మేరకు షుగర్స్ కేన్ కమిషనర్ కార్యాలయం నుంచి మంగళవారం ఉత్తర్వులు విడుదలయ్యాయి. కాంగ్రెస్ పార్టీకి చెందిన నరేంద్ర పేరును సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి ప్రతిపాదించడంతో ఆమోదం లభించింది. కాగా, నరేంద్ర నియామకంపై పలువురు కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

సంచార వాహనాల ద్వారా మెరుగైన సేవలు

కొత్తగూడెంరూరల్: రాష్ట్ర ప్రభుత్వం మూగజీవాల కోసం నిర్వహిస్తున్న 1962 పశువైద్య సంచార వాహనాల ద్వారా క్షేత్రస్థాయిలో మెరుగైన సేవలందించాలని స్టేట్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ భగీశ్‌మిశ్రా సూచించారు. ఉమ్మడి జిల్లా ప్రోగ్రాం మేనేజర్ భూమా నాగేందర్, జిల్లా కోఆర్డినేటర్ ప్రణయ్‌తో కలిసి భద్రాద్రి జిల్లాలోని కొత్తగూడెం, ఇల్లెందు, అశ్వారావుపేట, భద్రాచలం, మణుగూరు ప్రాంతాల్లో 1962 వాహనాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాహనాల్లో అత్యవసర ఔషధాలు, రికార్డులను, పరికరాల పనితీరును పరిశీలించి మాట్లాడారు. పశువులకు మెరుగైన చికిత్స అందించేలా యజమానులకు అందుబాటులో ఉండాలని సిబ్బందికి సూచించారు.

బెదిరిస్తున్నారని కూతురు, అల్లుడిపై ఫిర్యాదు

రఘునాథపాలెం: ఇంటి స్థలాలను రిజిస్ట్రేషన్ చేయాలంటూ తన కుమార్తె, అల్లుడు బెదిరిస్తున్నారని ఓ వ్యక్తి చేసిన ఫిర్యాదుతో మంగళవారం కేసు నమోదు చేసినట్లు రఘునాథపాలెం సీఐ ఉస్మాన్ షరీఫ్ తెలిపారు. మండలంలోని వీ.వీ.పాలెం గ్రామానికి చెందిన ఏ.చిన్న మల్సూర్ కుమార్తె నాగమణిని చింతగుర్తికి చెందిన సురేష్‌కు ఇచ్చి వివాహం చేశారు. మల్సూర్ పేరిట ఉన్న రెండు ఇంటి స్థలాలను తమ పేరిట రిజిస్ట్రేషన్ చేయాలని, లేకపోతే చంపుతామని కుమార్తె, అల్లుడు బెదిరిస్తున్నారని ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.19,144

కొనసాగుతున్న జోనల్ స్థాయి క్రీడాపోటీలు



ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థులతో ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు

వైరా: వైరాలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో జోనల్ స్థాయి క్రీడా పోటీలు కొనసాగుతున్నాయి. ఈ పోటీలు మంగళవారం రెండో రోజుకు చేరగా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని 14 గురుకులాల నుండి విద్యార్థులు పాల్గొంటున్నారు. కాగా, రెండో రోజు పోటీల్లో విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. అండర్–14 విభాగం షాట్‌పుట్‌లో పి.కీర్తి(నేలకొండపల్లి), టి.ఉమారాణి(అడవిమల్లెల), పి.సిపుర (ఇల్లెందు), లాంగ్ జంప్‌లో జి.మంజుని(కల్లూరు), వి.వైష్ణవి(ఇల్లెందు), జి.శ్రీహర్షిణి(ఇల్లెందు), అండర్–17 షాట్‌పుట్‌లో ఎం.నిహర్షిత(భద్రాచలం), బి.ప్రవచన(ఇల్లెందు), కె.స్రవంతి(భద్రాచలం), లాంగ్‌జంప్‌లో సీ.హెచ్.వినీల(ఇల్లెందు), కె.స్రవంతి(భద్రాచలం), డి.సాగరిక(టేకులపల్లి) వరుసగా మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. అండర్–19 విభాగం షాట్‌పుట్‌లో టి.అన్విత(కల్లూరు), పి.నేహా(పాల్వంచ), వి.పవిత్ర (కూసుమంచి), లాంగ్ జంప్‌లో ఎస్.సరిత(ఇల్లెందు), ఎస్.గ్లోరి(టేకులపల్లి), డి.పూజశ్రీ(ముల్కలపల్లి), అండర్–17 3వేల మీటర్ల పరుగు పందెంలో టి.మానస(ఇల్లెందు), అక్వీల సాయిశ్రీ(ములకలపల్లి), కె.స్రవంతి(భద్రాచలం), అండర్–19 3వేల మీటర్ల పరుగు పందెంలో ఎస్.భావన(ములకలపల్లి), జి.పూజితశ్రీ(అంబేడ్కర్ కాలేజ్ ఖమ్మం), పి.సంధ్య(ఎర్రుపాలెం) వరుసగా మొదటి మూడు స్థానాల్లో నిలిచి బహుమతులు అందుకున్నారు.

భవిష్యత్ పోరాటాలకు సిద్ధంగా ఉండండి



మాట్లాడుతున్న నున్నా నాగేశ్వరరావు, పక్కన నాయకులు

వైరా: కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలతో దేశంలో పేదరికం పెరుగుతుండగా, సంపద కొద్ది మంది చేతుల్లోనే కేంద్రీకృతమవుతోందని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు విమర్శించారు. ప్రజల సమస్యలపై భవిష్యత్‌లో పోరాటాలకు పార్టీ శ్రేణులు సిద్ధం ఉండాలని సూచించారు.వైరాలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ హక్కులను హరించి మనవాదాన్ని ముందుకు తీసుకొస్తున్న మోడీ ప్రభుత్వ చర్యలను ఖండిస్తూ ఉద్యమాలు చేపట్టాలని తెలిపారు. కాగా, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల అమలులో విఫలమైందని పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మాచర్ల భారతి విమర్శించారు. ఆరోపించారు. ఇకనైనా హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం 16 మంది సభ్యులతో వైరా పట్టణ కమిటీని ఎన్నుకున్నారు. నాయకులు బొంతు రాంబాబు, భూక్యా వీరభద్రం, మాదినేని రమేష్, మెరుగు సత్యనారాయణ, తాళ్లపల్లి కృష్ణ, పారుపల్లి ఝాన్సీ, కొండబోయిన నాగేశ్వరరావు, తోట నాగేశ్వరరావు, చురుకుమల్లి కుటుంబరావు, బొంతు సమత తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ నుంచి బయటకు వచ్చిన విద్యార్థులు

పోలీసుస్టేషన్‌లో అప్పగించిన యువకుడు

నేలకొండపల్లి: ప్రభుత్వ వసతి గృహం నుంచి బయటకు వచ్చి లిఫ్ట్ అడుగుతుండడంతో ఓ యువకుడు వారిని బైక్‌పై తీసుకెళ్లి పోలీసుస్టేషన్‌లో అప్పగించారు. స్థానికుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. మండలంలోని రాజేశ్వరపురం ఎస్సీ బాలుర వసతి గృహంలో ఉంటూ ఐదో తరగతి చదువుతున్న ఖమ్మంకు చెందిన కౌశిక్, అనాసాగారానికి చెందిన పి.సాగర్ మంగళవారం సాయంత్రం పెన్నులు తెచ్చుకుంటామని చెప్పి బయటకు వచ్చారు. ఎంత సేపటికీ వారు రాకపోవటంతో సిబ్బంది గ్రామంలో వెతుకుతూనే తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. అయితే, సదరు విద్యార్థులు గ్రామ శివారులో వాహనదారులన లిఫ్ట్ అడుగుతుండగా పారిపోతున్నారనే అనుమానంతో ఓ యువకుడు బైక్‌పై ఎక్కించుకుని ఖమ్మం పోలీస్‌స్టేషన్ అప్పగించాడు. ఈ విషయాన్ని వసతి గృహ అధికారి రవూఫ్‌కు సమాచారం ఇవ్వగా ఆయన సిబ్బంది, తల్లిదండ్రులతో కలిసి వెళ్లి పిల్లలను తీసుకొచ్చారు. కాగా, హాస్టల్‌లో ఉండడం ఇష్టం లేక విద్యార్థులకు బయటకు వచ్చినట్లు తెలుస్తుండగా, వారి ఆచూకీ లభించడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. అయితే, హాస్టల్ నుంచి పిల్లలను ఒంటరిగా బయటకు పంపించిన సిబ్బందిపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నేడు కేటీపీఎస్ ఇంజనీర్ల అసోసియేషన్ ఎన్నికలు



కేటీపీఎస్ 5, 6వ దశల్లో ప్రచారం చేస్తున్న ఉమామహేశ్వరరావు

పాల్వంచ: పాల్వంచలోని కేటీపీఎస్ కాంప్లెక్స్ పరిధిలో తెలంగాణ స్టేట్ పవర్ ఇంజనీర్ల అసోసియేషన్ ఎన్నికలు బుధవారం జరగనున్నాయి. కేటీపీఎస్ 5, 6వ దశలు, 7వ దశ బ్రాంచ్‌ల కార్యవర్గాలను ఎన్నుకునేందుకు స్థానిక ఇంజనీర్ల అసోసియేషన్ హాల్‌లో బ్యాలెట్ పద్ధతిలో పోలింగ్ జరగనుంది. ఉదయం 8–30 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరిగే పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తిచేయగా సెక్రటరీ పదవి కోసం పోటీ పడుతున్న ఉద్యోగులు ప్రచారంలో నిమగ్నమయ్యారు. కేటీపీఎస్ 5, 6వ దశల్లో 344, 7వ దశలో 277 ఓట్లు ఉన్నాయి. ఏఈ క్యాడర్ మొదలు ఏడీఈ, డీఈ, ఈఈ, ఎస్ఈ, సీఈ వరకు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.

ఇప్పటికే పలు పదవులు ఏకగ్రీవం

కేటీపీఎస్ 5, 6వ దశల కర్మాగారంలో అసోసియేషన్ సెక్రటరీ పదవి కోసం డి.ఉమామహేశ్వరరావు, జీఎస్ఆర్ భవానీప్రసాద్ పోటీ పడుతున్నారు. ఇప్పటికే కోశాధికారిగా చంద్ర కళావతి, మహిళా రిప్రజెంటేటివ్‌గా పావని, అసిస్టెంట్ సెక్రటరీలుగా ప్రదీప్, దివాకర్, మధుసూదన్, రామారావు, శ్రీలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 7వ దశ బ్రాంచ్ సెక్రటరీ పోస్ట్ కోసం ఎస్‌కే యాస్మిన్, వై.రవికుమార్, ట్రెజరర్‌గా వి.నరేందర్, పి.సంపత్‌కుమార్, అడిషనల్ సెక్రటరీ పోస్టులు ఐదింటికి బి.వెంకటరావు, డి.రాజేశ్, జి.అరుణ్‌కుమార్, జి.రాజేందర్, హెచ్.కిషన్, కె.శ్రీనివాసరావు, కె.ఉదయ్‌కిరణ్, ఎండీ అక్బర్ పాషా, ఎం.గణేశ్, ఎస్.నాగరాజు పోటీలో ఉన్నారు. ఇప్పటి వరకు బ్రాంచ్ సెక్రటరీగా ఉన్న పి.బ్రహ్మజీ జెన్‌కో వైస్ ప్రెసిడెంట్‌గా ఏకగ్రీవమయ్యారు. అలాగే, అడిషనల్ జాయింట్ సెక్రటరీగా ఎం.రాజేశ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ(థర్మల్) యాకూబ్, ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా శ్రీకాంత్, 5, 6 దశల నుంచి జెన్‌కో డిప్యూటీ సెక్రటరీ (థర్మల్)గా ఎం.శ్రీనివాసరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

23న ఏఐబీఈ మోడల్ పరీక్ష

ఖమ్మం లీగల్: ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్(ఐఏఎల్) ఆధ్వర్యాన ఈనెల 23న ఏఐబీఈ(ఆల్ ఇండియా బార్ ఎగ్జామ్) మోడల్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.కే.లతీఫ్, ఓరుగంటి శేషగిరిరావు తెలిపారు. ఖమ్మంలోని మానేరు లా కళాశాలలో ఉదయం 11నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు పరీక్ష జరుగుతుందని తెలిపారు. ఈమేరకు న్యాయశాస్త్ర విద్యార్థులు రిజిస్ట్రేషన్ కోసం 98483 34165(లతీఫ్), 94909 82119(కె.శరత్), 99595 94084(ఎం.నవీన్‌కుమార్), 91009 99344(ఎం.సతీష్) నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

మహిళలు ఉపాధి రంగాల్లో ముందు నిలవాలి



శిక్షణను ప్రారంభించి మాట్లాడుతున్న డైరెక్టర్ చంద్రశేఖర్

చింతకాని: మహిళలు ఉపాధి రంగాల్లో ముందు నిలుస్తూ కుటుంబాల ఆర్థికాభివృద్ధిలో పాలుపంచుకోవాలని గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ (ఆర్‌సెటి) డైరెక్టర్ చంద్రశేఖర్ సూచించారు. చింతకానిలోని ఐకేపీ కార్యాలయంలో విజయభారతి మహిళా మండలి ఆధ్వర్యాన ఎస్‌బీఐ – ఆర్‌సెటి తరఫున ఏర్పాటు చేసిన వర్మీ కంపోస్ట్ తయారీ శిక్షణను మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంత మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలను కల్పించేలా వివిధ అంశాల్లో శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. వర్మీ కంపోస్ట్ తయారీలో ఆసక్తి ఉన్న మహిళలు ఐకేపీ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. అనంతరం శిక్షణకు హాజరైన మహిళలకు యూనిఫామ్ అందజేశారు. కోర్సు కోఆర్డినేటర్ వహీద్‌పాషా, మహిళా మండలి అధ్యక్షురాలు విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

వైరారూరల్: షార్ట్ సర్క్యూట్‌తో కారణంగా పూరిల్లు దగ్ధమైన ఘటన మండలంలోని గరికపాడు లో మంగళవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు... గ్రామానికి చెందిన మాతంగి గోపయ్య – సువార్త దంపతులు తమ పూరింట్లో అన్నం వండుకుంటున్న సమయాన షార్ట్ సర్క్యూట్ ఏర్పడి మంటలు వ్యాపించాయి. దీంతో గోపయ్య బయటకు వస్తుండడంతో కింద పడగా గాయాలయ్యాయి. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు చేరుకుని మంటలను అదుపు చేసేలోగా ఇల్లు, సామగ్రి పూర్తిగా కాలిపోయాయి. కాగా, ఆర్ఐ వెంకటేశ్వర్లు పంచనా నిర్వహించి రూ.లక్షన్నర మేర ఆస్తి నష్టం వాటిల్లినట్లు నిర్ధారించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలు

తల్లాడ: తల్లాడ యూనియన్ బ్యాంక్ ఎదురుగా మంగళవారం మోటార్ సైకిల్ ఢీకొట్టిన ఘటనలో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. తల్లాడకు చెందిన తడికమల్ల కృష్ణవేణి ఎస్‌బీఐ వినియోగదారుల సేవా కేంద్రంలో నగదు డ్రా చేసుకొని రోడ్డు దాటుతుండగా కల్లూరు వైపు నుంచి అతివేగంగా వచ్చిన మోటార్ సైకిల్ ఢీకొట్టింది. దీంతో కృష్ణవేణి తలకు తీవ్రగాయం కాగా, 108వాహనంలో ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

ఆత్మహత్య చేసుకుంటానంటూ హల్‌చల్

నేలకొండపల్లి: కుటుంబ కలహాలపై పంచాయితీ నిర్వహిస్తుండగా ఓ వ్యక్తి పురుగుల మందు డబ్బా, సూసైడ్ లేఖతో వచ్చి ఆత్మహత్య చేసుకుంటానంటూ హల్‌చల్ సృష్టించాడు. స్థానికుల కథనం ప్రకారం వివరాలు... సూర్యాపేట జిల్లా మోతె మండలానికి చెందిన గోపికి నేలకొండపల్లి మండలానికి చెందిన యువతితో కొన్నాళ్ల క్రితం వివాహం జరిగింది. ఇటీవల ఇరువురి మధ్య మనస్పర్థలు రావడంతో యువతి అమ్మాయి తరఫు బంధువులు నేలకొండపల్లిలోని ఓ పార్టీ కార్యాలయంలో పంచాయితీ నిర్వహించారు. అక్కడకు సూసైడ్ లెటర్, పురుగుల మందు డబ్బాతో వచ్చిన గోపి తాను ఆత్మహత్య చేసుకుంటానంటూ కేకలు వేశాడు. అక్కడ నుంచి పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకుని పురుగుల మందు తాగే యత్నం చేయగా పోలీసులు పురుగుల మందు డబ్బా లాక్కుని పంపించారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్య

ఖమ్మంరూరల్: మండలంలోని కామంచికల్‌కు చెందిన ఎస్.కే.మీరా(40) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సీఐ ముష్క రాజు తెలిపిన వివరాలు... మీరాకు కాస్త నత్తి ఉండడంతో ఎక్కడ పెళ్లి సంబంధాలు చూసినా కుదరలేదు. దీంతో సోదరి అయిన జంగిటి అనూష వద్ద ఉంటూ కూలీ పనులకు వెళ్తున్న ఆయన కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. తనకు ఇక పెళ్లి కాదనే మనస్తాపంతో ఈనెల11న పురుగుల మందు తాగగా కుటుంబీకులు ఖమ్మం ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడే చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడని సీఐ తెలిపారు.

ప్రారంభమైన ఎద్దుల బలప్రదర్శన పోటీలు

తొలి రోజు విజేతగా పత్తిపాడు అంజయ్య జత



పోటీలను ప్రారంభిస్తున్న సీతారాములు, దయాకర్‌రెడ్డి

నేలకొండపల్లి: మండలంలోని రాజేశ్వరపురంలో ఒంగోలు జాతి ఎద్దుల బల ప్రదర్శన పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. కార్తీక పౌర్ణమి సందర్భంగా ఏటా ఉమ్మడి తెలుగు రాష్ట్రాల స్థాయి పోటీలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ మేరకు పోటీలను నేలకొండపల్లి మార్కెట్ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ టి.దయాకర్‌రెడ్డి ప్రారంభించారు. తొలిరోజు రెండు పళ్ల విభాగంలో పోటీలు జరగగా ఏపీలోని గుంటూరు జిల్లా పత్తిపాడుకు చెందిన పమ్మిడి అంజయ్య జత విజేతగా నిలిచింది. ఆ తర్వాత స్థానాల్లో సూర్యాపేట జిల్లా మఠంపల్లికి చెందిన గాదె అషారెడ్డి, పల్నాడుకు చెందిన శ్రావణినాయుడు, జననీనాయుడు, గుంటూరు జిల్లా పెద్దకాకాని మండలం జక్కేలపాడుకు చెందిన నవీన్‌కుమార్, ఎన్టీఆర్ జిల్లా చందర్లపాడు మండలం గుత్తావారిపాలెంనకు చెందిన నర్సింహారావు జతలు విజేతలుగా నిలవగా బహుమతులు అందజేశారు. సొసైటీ చైర్మన్ తన్నీరు కృష్ణమూర్తితో పాటు ఎర్రబోయిన నర్సయ్య, శాఖమూరి రమేశ్, కొర్లకుంట్ల నాగేశ్వరరావు, వెనికె జానకీరామయ్య, కుక్కల హన్మంతరావు, బచ్చలకూరి నాగరాజు, చిట్యాల రమేష్, కడియాల నరేశ్, దండా సత్యనారాయణ, ఇస్లావత్ బాలాజీ, ఆర్.నవీన్, కె.ఉపేందర్, సుధీర్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వ నిర్లక్ష్యం

బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి



పాలేరులోని కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న నాయకులు

కూసుమంచి: ధాన్యం కొనుగోళ్లలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి విమర్శించారు. మండలంలోని పాలేరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం పరిశీలించిన ఆయన రైతుల ఇబ్బందులను తెలుసుకున్నారు. అనంతరం శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం మిల్లర్లలో కుమ్మక్కవడంతోనే ధాన్యం కొనుగోళ్లలో జాప్యం చేస్తోందని పేర్కొన్నారు. నరేంద్రమోడీ నేతృత్వంలోని కేంద్రప్రభుత్వం వరి ధాన్యం క్వింటాకు రూ.2,320 మద్దతు ధర ప్రకటించడమే కాక రవాణా, ఇతర ఖర్చులు సైతం భరిస్తోందని తెలిపారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం తీరుతో కాంటాల్లో జాప్యం, ఇతర కారణాలతో రైతులు అవస్థ పడుతున్నారని, ఇకనైనా కొనుగోళ్లలో వేగం పెంచకపోతే ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నున్నా రవికుమార్, నాయకులు తక్కెళ్లపల్లి నరేంద్రరావు, మేక సంతోష్‌రెడ్డి, మల్లారెడ్డి, వెంకటేశ్వర్లు, ఉపేందర్‌రెడ్డి, రవిరాథోడ్, సుధాకర్, ఉపేందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సస్యరక్షణ చర్యలతో తెగుళ్ల నివారణ



మిర్చి పంటను పరిశీలిస్తున్న కేవీకే కోర్డినేటర్ రవికుమార్, ఏడీఏ విజయ్‌చంద్ర

చింతకాని: పంటలను ఆశిస్తున్న తెగుళ్లను రైతులు ఎప్పటికప్పుడు గుర్తించి సమగ్ర సస్యరక్షణ చర్యలు పాటించడం ద్వారా వాటిని నివారించాలని వైరా కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ రవికుమార్, మధిర ఏడీఏ స్వర్ణ విజయ్‌చంద్ర సూచించారు. చింతకాని మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం వరి, పత్తి, మిర్చి పంటలను పరిశీలించి తెగుళ్ల నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. భూమిలో తేమ పెరిగినప్పుడే కాక కొన్నిసార్లు పొడి వాతావరణంలోనూ పంటలను తెగుళ్లు ఆశిస్తాయని తెలిపారు. ప్రస్తుతం వరిని ఎండాకు తెగులు, సుడిదోమ ఆశిస్తున్నాయని, సుడిదోమ ఉధృతంగా ఉందని చెప్పారు. అలాగే, పూత, పిందె దశలో ఉన్న మిరపలో కొమ్మ కుళ్లు తెగులు ఆశిస్తోందని, వీటి నివారణకు అధికారుల సూచనలతో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం చింతకాని రైతువేదికలో ఏర్పాటు చేసిన రైతునేస్తం వీడియో కాన్ఫరెన్స్‌లో శాస్త్రవేత్తలు, అధికారులు పాల్గొన్నారు. మండల వ్యవసాయాధికారి మానస, ఏఈఓలు రాము, ఆయేషా, సుప్రజ, కార్తీక్, కల్యాణి, తేజ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మధిర: గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. కల్లూరు మండలం యర్రబోయినపల్లి గ్రామానికి చెందిన ఫిజియోథెరపిస్ట్ కొలికపోగు సోమయ్య(35) మంగళవారం రాత్రి వైరా నుంచి మధిర వైపు మోటార్ సైకిల్‌పై వస్తున్నాడు. మండలంలోని కృష్ణాపురం సమీపాన వచ్చిన తర్వాత వెనక నుంచి వచ్చిన గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సమాచారం తెలుసుకున్న మధిర రూరల్ ఎస్ఐ లక్ష్మీభార్గవి చేరుకుని ప్రమాదానికి కారణమైన వాహనం ఆచూకీ కోసం తనిఖీలు చేపట్టారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు

చింతకాని: మండలంలోని బొప్పారం గ్రామానికి చెందిన రాయల గోపి కానరాకుండా పోవడంతో పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. గత నెల 27వ తేదీన విజయవాడ వెళ్తున్నానని చెప్పి బయలుదేరిన గోపి తిరిగి రాలేదు. ఎక్కడ వెతికినా ఆచూకీ లేక ఆయన భార్య స్వరూప ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని ఎస్సై నాగుల్ మీరా తెలిపారు.

రూ.72లక్షలకు ఐపీ దాఖలు

ఖమ్మం లీగల్: ఖమ్మం శుక్రవారిపేటకు చెందిన దొడ్డా వెంకటేశ్వరరావు రూ.72లక్షలకు గాను దివాళా పిటీషన్(ఐపీ) దాఖలు చేశాడు. రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసిన తాను పలువురి వద్ద తీసుకుని అప్పులు తీర్చలేని పరిస్థితి ఎదురైందంటూ న్యాయవాదులు చుంచుల మల్లికార్జున్, ఆర్.నారాయణ స్వామి ద్వారా ఖమ్మం సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో దివాళా పిటిషన్ దాఖలు చేశాడు. కాగా, పిటిషన్‌లో తొమ్మిది మందిని ప్రతివాదులుగా చేర్చాడు.

పేకాట స్థావరంపై దాడులు

తిరుమలాయపాలెం: మండలంలోని పిండిప్రోలు శివారు నర్సరీ పక్కన పేకాట స్థావరంపై ఎస్ఐ కూచిపూడి జగదీష్ ఆధ్వర్యాన మంగళవారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా పేకాట ఆడుతూ పట్టుబడిన పిండిప్రోలుకు చెందిన ఆరుగురిపై కేసు నమోదు చేసి, సెల్ ఫోన్లు, బైక్‌లు, రూ.2,350 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.